క్లుప్తంగా

శాకంబరీదేవిగా అంకమ్మతల్లి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో శాకంబరీ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబంధీరావు అమ్మవారిని పలు రకాల కూరగాయలతో శాకంబరిదేవీగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చనలు, శ్రీ చక్రార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈనెల 3వ తేదీ వరకు శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తామని శరాబంధీరావు తెలిపారు.

నగరంలో శ్రీలీల సందడి



లబ్బీపేట(విజయవాడతూర్పు): పెళ్లి సందడి, ధమాకా, ఉస్తాద్‌భగత్‌సింగ్ వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటించిన శ్రీలీల శనివారం నగరంలో సందడి చేశారు. వినూత్న నటనతో ప్రేక్షకుల మనసు దోచుకున్న ఈమె నగరంలో తళుక్కుమంది. ప్రముఖ సిల్వర్ జ్యూయలరీ షోరూమ్‌ను ప్రారంభించేందుకు ఆమె నగరానికి విచ్చేసింది. దీంతో పెద్ద ఎత్తున అభిమానులు ఆమెను చూసేందుకు తరలివచ్చారు. దీంతో ఎంజీ రోడ్డులో షోరూమ్‌వద్ద కోలాహలం నెలకొంది. సిల్వర్ ఆభరణాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన గోయాజ్ సిల్వర్ సంస్థ తన మూడో షోరూమ్‌ను విజయవాడలోని ఎంజీ రోడ్డులో ప్రారంభించింది. ఈ షోరూమ్‌ను ప్రారంభించిన శ్రీలీల అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ డిజైన్స్ చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరినీ వెండి ఆభరణాలు ఆకట్టుకుంటాయన్నారు. సినీ విశేషాలను పంచుకున్నారు.

108 వాహనంలో సుఖ ప్రసవం



లబ్బీపేట(విజయవాడతూర్పు): పురిటినొప్పులతో ఉన్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే సుఖ ప్రసవం చేసిన ఘటన శనివారం విజయవాడలో జరిగింది. వివరాల ప్రకారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన గర్భిణి శంఖం మహిమ శనివారం ఉదయం 7.45 గంటలకు పురిటినొప్పులు రావడంతో 108 వాహనానికి ఫోన్ చేశారు. కాల్ అందుకున్న కంట్రోల్ రూమ్(పాతప్రభుత్వాస్పత్రి ఆవరణలోని) వెహికల్ ఆమె ఇంటికి వెళ్లింది. అప్పటికే నొప్పులు ఎక్కువగా రావడంతో వెహికల్‌లో పాత ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే ప్రసవం జరిగింది. 108 వాహనంలోని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వినయ్‌కుమార్‌తో పాటు, గర్భిణి వెంట ఉన్న సహాయకులతో కలిసి వాహనంలోనే ప్రసవం చేశారు. అనంతరం మహిమ రక్తహీనతతో ఉండటంతో పాత ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండటంతో మహిళ భర్త కోటయ్య 108 సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

ఠంఛన్‌గా పింఛన్



పాయకాపురం(విజయవాడరూరల్): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు అందజేస్తున్నారని కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ అన్నారు. శనివారం ఆమె కండ్రికలో వలంటీర్లు, గృహ సారథులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అర్హత ఉండి సాంకేతిక కారణాల వలన పెన్షన్ పొందలేక పోతున్న వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలరు. డివిజన్‌లో మొదటి రోజు 1,945 మంది లబ్ధిదారులకు రూ.54 లక్షల పైగా పెన్షన్లు పంపిణీ చేశామన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్‌లో పింఛన్ పంపిణీ కార్యక్రమం శనివారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఒక్కటో తేదీనే పింఛన్ అందించటం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి సుందర్‌పాల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించేందుకే 'జగనన్న సురక్ష'

- జగనన్న సురక్ష పేదలందరికీ శ్రీరామరక్ష
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మారుతీనగర్‌లోని 30వ వార్డు సచివాలయంలో శనివారం నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన వారికి లబ్ధి చేకూర్చే దిశగా జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల వినతులను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల వద్ద నెల రోజుల పాటు నిర్దేశిత తేదీల్లో ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ శిబిరాల్లో మండల స్థాయి అధికారుల నుంచి వార్డు సచివాలయ సిబ్బంది వరకు అందుబాటులో ఉంటారని అవసరమైన వారికి కుల, ఆదాయ, జనన, మరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, మ్యుటేషన్, అడంగల్‌లో మార్పులు, కౌలు రైతుల కార్డులు, ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం, కొత్త రేషన్‌కార్డు, కార్డు విభజన వంటి 11 రకాల సర్వీసులను ఎటువంటి సర్వీస్ చార్జి లేకుండా త్వరితగతిన జారీ చేస్తామని చెప్పారు.

53 క్లస్టర్‌లో 596 అర్జీలు

26వ డివిజన్లలోని 4 సచివాలయ పరిధిలో ఉన్న 53 క్లస్టర్లలో 596 అర్జీలు స్వీకరించినట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. వీటిలో 317 కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఉండగా.. 267 ఇన్ కమ్, 2 ఎకనమికల్లీ వీకర్స్, 4 కొత్త రేషన్ కార్డులు, మరో 6 రేషన్ కార్డు స్ప్లిట్టింగ్‌కు అర్జీలు వచ్చాయన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తొలిరోజే వీరందరికీ ఆయా ధ్రువపత్రాలు ఉచితంగా అందజేస్తుండటంతో.. ఈ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకం రెట్టింపు అయ్యిందన్నారు.

11 రకాల సేవలు..

నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. ప్రజలకు 11 రకాల ప్రభుత్వ సేవలను ఎటువంటి రుసుం లేకుండా అందజేయడంతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ఒక్కో కుటుంబం వద్ద కనీసం 20 నుంచి 30 నిమిషాల సమయం కేటాయించి ఇప్పటికే వలంటీర్లు ప్రజల అభిప్రాయాలను సేకరించారని చెప్పారు. వారందరికీ ప్రత్యేక శిబిరాల ద్వారా పరిష్కారం చూపుతున్నామని, ప్రతిఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే శిబిరానికి వచ్చే వారి కోసం తాగునీరు, స్నాక్స్, కూర్చోవడానికి తగిన సౌకర్యాలతో పాటు వైద్య శిబిరాలను సైతం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం టోకెన్ నంబర్ల ఆధారంగా అర్జీదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, పీవో యూసీడీ శకుంతల, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ బాబూ శ్రీనివాసరావు, నాయకులు ఏ నాగేశ్వరరావు గొల్లభామ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సెల్ ప్లాంట్ పనులను వెంటనే పూర్తి చేయాలి



నూతన ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఎక్సెల్ ప్లాంట్‌ను శనివారం ఆయన పరిశీలించి ప్లాంట్‌లో జరుగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఎంట్రన్స్ గేట్ దగ్గర ఏర్పాటు చేసిన సెక్యూరిటీ రూమ్, నూతనంగా కొన్న వస్తువులను పరిశీలించి ఎక్కడెక్కడ ఏయే వస్తువులను అమర్చాలో అధికారులను సూచించారు. అనంతరం క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న కాలువల పరిశుభ్రతతో పాటు కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో, వీధుల్లో చెత్త వేయకుండా ప్రజలు బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు. కాలువల పరిశుభ్రత పనుల పర్యవేక్షణలో భాగంగా 34వ డివిజన్‌లోని సీకే రోడ్డు, మీసాల రాజేశ్వరరావు బ్రిడ్జి పక్కన పరిశీలించి బ్రిడ్జి పక్కన ఉన్న చెక్క పెట్టెలను అక్కడి నుంచి తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి బందరు రోడ్డు దూరదర్శన్ ఆఫీస్ దగ్గర జరుగుతున్న కారిడార్ ఫుట్‌పాత్ నిర్మాణ పనులను పరిశీలించారు. అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిస్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న రంగరాజన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం కె.రంగరాజన్ అన్నారు. సూర్యారావుపేటలోని స్టేట్ బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో శనివారం బ్యాంక్ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ డే సందర్భంగా ఈ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. గుండె, కంటి, మహిళా ఉద్యోగులకు గైనకాలజీ విభాగంలో వైద్య పరీక్షలు, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంపులో 200 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రపంచంలోని మొదటి 50 బ్యాంకుల్లో అగ్రగామిగా ఉందని, ఇటీవల ప్రకటించిన లాభాల్లో రూ. 50 వేల కోట్లు లాభార్జన గడించి మిగిలిన అన్ని బ్యాంకుల కంటే ముందుందని తెలిపారు. అపరిచితుల ఫోన్ కాల్స్‌లో ఓటీపీలు చెప్పడం గానీ, ఏటీఎం పిన్ నెంబర్లు చెప్పడం గాని చేయవద్దని సూచించారు. బ్యాంక్ 68వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



నివాళులర్పిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ వెంకటేష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్యరంగంలో ఎన్నో డిగ్రీలు చేసి, రోగులకు విశేష సేవలు అందించిన డాక్టర్ బీసీ రాయ్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. వైద్య రంగంలో ఆయన చేసిన సేవలకు గాను డాక్టర్ బీసీ రాయ్ పుట్టిన, మరణించిన రోజైన జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. వైద్య విద్యార్థులు, వైద్యుల ఆధ్వర్యంలో శనివారం డాక్టర్స్‌డే వేడుకలు నిర్వహించారు. వైద్య కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీసీరాయ్ విగ్రహానికి డాక్టర్ కంచర్ల సుధాకర్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా, కోల్‌కత్తా మేయర్‌గా, వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. ఆయన చేసిన సేవలకు భారతరత్న అవార్డును పొందారన్నారు. పెద్ద సంఖ్యలో వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో..

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, రైల్వే మెడికల్ ఆఫీసర్స్ సంఘం విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విజయవాడ రైల్వే ఆస్పత్రిలోని ఓపీడీ భవన్‌లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల డివిజన్‌లోని వైద్య బృందం, ఇండియన్ రైల్వే హెల్త్ సర్వీసెస్ వైద్యులకు జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రాణాలు కోల్పోయిన వైద్యులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆర్థో సర్జన్ డాక్టర్ మురళి డాక్టర్ చరిత్ర, డాక్టర్ బి.సి.రాయ్ గ్రంథంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వైద్యులు, ఏసీ ఎంఎస్‌లు జైదీప్, రవికాంత్, సత్యనారాయణ, సీతారామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కనిపించే దైవం వైద్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కనిపించే దైవం వైద్యులు అని అటువంటి వైద్యులను సత్కరించుకోవటం కనీస బాధ్యత అని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ అన్నారు. డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్స్ డే పురస్కరించుకుని ప్రముఖ వైద్యులు డాక్టర్ చల్లా హరికుమార్, డాక్టర్ అద్దేపల్లి ప్రేమ్ కుమార్, డాక్టర్ సత్యనారాయణల సత్కారం కార్యక్రమం శనివారం జరిగింది. ట్రస్ట్ సభ్యులు గుర్రం ఏడుకొండలు, కొండాయగుంట రాము, మండా రాము, కె వరప్రసాద్, మల్లిక, షఫీ, హేమంత్, విల్సన్ పాల్గొన్నారు. అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన ఏలూరు రోడ్డులో ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్ 200 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చలపతి గుప్తా, కోట శ్రీనివాసరావు, రామమూర్తి కన్నన్ పాల్గొన్నారు.

వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ మెయిన్ రోడ్డులోని శ్రీ భగవాన్ షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాల్లో భాగంగా శనివారం బిక్షాటన చేపట్టారు. పల్లకీలో బాబా వారిని ఉంచి సాయినామ సంకీర్తన చేస్తూ బిక్షాటన చేశారు. కార్యక్రమంలో షిరిడీసాయిబాబా తత్వబోధకులు ఆధ్యాత్మిక వేత్త గురుదేవులు రామ్‌జీ బాబా పాల్గొని నగర సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు బాబావారికి హారతులు ఇస్తూ స్వాగతం పలి కారు. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, పారాయణ మండలి సభ్యులు పాల్గొన్నారు.

తిరుమల నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయలు

లబ్బీపేట(విజయవాడతూర్పు)ఫ అయ్యప్పనగర్‌కు చెందిన గొట్టిముక్కల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 10 టన్నుల కూరగాయలను శనివారం తిరుమల నిత్యాన్నదాన పథకానికి పంపించారు. కూరగాయలతో కూడిన లారీకి పూజలు నిర్వహించిన నాగేశ్వరరావు, అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సహకారంతో తిరుమలకు కూరగాయలు పంపుతున్నామన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ కార్యవర్గం ఎన్నిక



లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ నూతన కార్యవర్గం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సమాజ సేవలో లయన్స్‌క్లబ్ పాత్ర ఎనలేనిదని లయన్స్‌క్లబ్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లింగం శివశంకర్ అన్నారు. నగరంలో శనివారం సాయంత్రం లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతనంగా ఎన్నికైన లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ అధ్యక్షుడే తోట పద్మనాభరావు, కార్యదర్శి బండి రామ్మోహనరావు, కోశాధికారి దిరిసల మాచిరాజు, ఇతర సభ్యులతో లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వైపీసీ ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు కంకణాల శ్రీనివాసరావు, వీవీ సాయి వరప్రసాద్, మిరియాల వెంకటేశ్వరరావు, డి.గోపీనాథ్, టి.శ్రీహరిరావు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దే శేషగిరి పాల్గొని మాట్లాడారు. నిరంజన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ వేమూరి సత్యనారాయణ, కోశాధికారి కొల్లి రామకృష్ణ ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ సీహెచ్ శ్రీనివాస రెడ్డి, రీజియన్ చైర్‌పర్సన్ మోహనబాబు, వై.శ్రీనివాసరావు, రామిశెట్టి కొండలరావు, డాక్టర్ దవులూరి కైలాసరావు పాల్గొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా నగరంలోని ఏడుగురు డాక్టర్లను సత్కరించారు. వైద్యుల సేవలను కొనియాడారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న తోట శ్రీనివాస్ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదివి నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక బుడమేరు మధ్యకట్ట విజయదుర్గానగర్ తమ్మిన దుర్గారావు నగరపాలకసంస్థ పాఠశాలలో శనివారం హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నాడు - నేడు పథకం ద్వారా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. నిరుపేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక మాట్లాడుతూ.. తమ వంతు సామాజిక బాధ్యతగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు స్టేషనరీ అందజేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, నాయకులు అన్నపురెడ్డి రామిరెడ్డి, డి.అశోక్, శ్రీకాంత్, తోట భాస్కర్ ఉపాధ్యాయురాలు టి.వాసవి తదితరులు పాల్గొని మాట్లాడారు.

దేశానికే ఆదర్శంగా ప్రభుత్వ పథకాల అమలు



సంక్షేమ పథకాల బ్రోచర్‌తో పాటు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దనే పింఛన్ అందిస్తూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు అవినీతి పాలనకు, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన మధ్య ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం 24వ డివిజన్ 36వ సచివాలయ పరిధిలోని శ్రీహరిరావు వీధి, కృష్ణారావు వీధుల్లో పర్యటించారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సచివాలయ పరిధిలోని అవ్వా తాతలకు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం అవ్వా తాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు.

టీడీపీ హయాంలో అవినీతి..

రాష్ట్రంలో పింఛన్లపై టీడీపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే విష్ణు మండిపడ్డారు. రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక, పింఛన్‌దారులకు చుక్కలు చూపించారన్నారు. పింఛన్‌దారుడు మృతి చెందితే కొత్త వారికి పింఛన్ అనే విధానాన్ని కొనసాగించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు, సానుభూతి పరులతో జన్మభూమి కమిటీలు వేసి వసూళ్లకు తెరతీశారని దుయ్యబట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అందించిన పింఛన్లపై శ్వేతపత్రాన్ని విడుదల చేసే దమ్ముందా అని నిలదీశారు. కొత్త పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అంతేకాక ఫింఛన్ అందుకునేందుకు రోజుల తరబడి పడిగాపులు పడుతూ, క్యూలో నిలుచులేక నరకయాతన అనుభవించే వారన్నారు. వృద్ధాప్య పింఛన్ అర్హతను 65 ఏళ్ల నుంచి 60కు తగ్గించిన ఘనత కూడా సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు కుక్కల రమేష్, కొమ్ము చంటి, బెల్లపు సత్యనారాయణ, చిట్టిబాబు, క్రాంతి పాల్గొన్నారు.

● వైభవంగా శాకంబరీదేవి ఉత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రిపై శాకంబరీదేవి ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణాన్ని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారిని తొలి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం పోలవరం నిర్వాసితుల పోరుకేక మహాపాదయాత్రకు మద్దతుగా దళిత, గిరిజన, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. నిర్వాసితులకు పునరావాసం చట్టం, 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల పునరావాసం బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. సమావేశంలో వివిధ సంఘాల నేతలు బి.కిరణ్ నాగమణి, జి.రామారావు, పిచ్చుక శ్రీనివాస్, కరవది సుబ్బారావు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై చర్యలకు డీఈవో సిఫార్సు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాచవరంలోని టీఎంఆర్సీ నగరపాలకసంస్థ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక విద్యాశాఖ ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. వివరాల్లోకి వెళితే మాచవరం టీఎంఆర్సీ నగరపాలకసంస్థ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న కుమార్‌రెడ్డి జూన్ 30వ తేదీన 14 మంది విద్యార్థులను ఒంటిపై వాతలు వచ్చేటట్లుగా దండించారు. దానిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దానిపై జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక విచారణ చేయాలని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్‌ను ఆదేశించారు. ఆయన శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, అలాగే విద్యాకమిటీ ప్రతినిధులతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు. విద్యార్థులను ప్లాస్టిక్ పైప్‌తో అకారణంగా కొట్టడంతో పాటు విద్యార్థినులను రాళ్లపై మోకాళ్లపై కూర్చోపెడుతున్నారని వివరించారు. వాటి వివరాలను కేవీఎస్‌కుమార్ సీవీ రేణుక దృష్టికి తీసుకెళ్లగా ప్రధానోపాధ్యాయునిపై చర్యలకు ఉన్నతాధికారులకు ఆమె లేఖ రాశారు.

మైనార్టీ నేతల ఆత్మీయ సమావేశం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరానికి చెందిన మైనార్టీ నేతల ఆత్మీయ సమావేశం శనివారం లబ్బీపేటలోని అల్ మునీర్ ఫౌండేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎండీ రూహుల్లా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్, నగరపాలకసంస్థ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎండీ ఆబీద్‌లతో పాటు, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్, నూరుద్దీన్, పలు ముస్లిం సంఘాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న యూనిఫాం సివిల్ కోడ్‌తో పాటు పలు అంశాలపై చర్చించారు. ఈ విషయంలో సంఘటితంగా నిర్ణయాన్ని వెల్లడించాలని, లా కమిషన్‌కు అందరి అభిప్రాయాలను తెలియజేయడంపై చర్చించారు.